శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

# మృత్యుహేల

అప్పుడే పోస్టుమాన్ వచ్చి ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. అది వుత్తరంగాదు న్యూట్రాన్ బాంబు! గుంటూరు నుంచి రమణ వ్రాశాడు. చిన్ననాటి ప్రాణమిత్రుడు ప్రకాశరావు పదిహేనురోజులక్రితం పోయాడని ఆవుత్తరంలోనిసారాంశం. ప్రకాశరావుకి నిండా పాతికేళ్ళులేవు. ఏ దురలవాటూలేదు. ఆరోగ్యంగా హుషారుగా వుండేవాడు. అటువంటి ప్రకాశరావుకి గుండెజబ్బు వచ్చిందట! ఒకవారంలోనే రెండుసార్లు గుండెపోటువచ్చి, అయిపోయాడట, ప్రకాశరావు!!

కాంతారావు నాలుగునిముషాలు మౌనంగా వుండిపోయాడు. మనసుపొరలలో అగ్నిపర్వతాలు పగిలాయి. గుండెల్లో తుఫాను చెలరేగింది. అప్రయత్నంగానే కన్నులు తడి నింపుకున్నాయి. కళ్ళుతుడుచేకుని మవునంగానే రోధించాడు. బాధపడ్డాడు.

ఆ రోదనని అణచివుంచటానికీ, ఆతుఫానునుపారద్రోలటానికీ, ఒక్కటే మార్గం. కలమూ, కాగితాలూ. "ప్రకాశరావు ఆత్మశాంతి" కోసంనాలుగునిముషాలు మౌనం పాటించి, కాగితాలూ, కలం చేతబట్టాడు కాంతారావు. పరపర రాసిపారవేశాడు. చకచక కలం గుర్రంవలె పరుగులుతీసింది. చేతులు నొప్పిపెట్టాయి. మెదడు అలసటవచ్చి రొప్పింది. నరాలు తీవ్రంగా మూల్గాయి అయినా కాంతారావుకలంఆగలేదు సాగిపోయింది. ఇక్కడ కొన్నికోట్ల సంవత్సరాల నుంచి సూర్యుడు చండప్రచండంగా వెలుగుతూవున్నాడు. ఆవెలుగులో శక్తివుంది. ఆశక్తివలన సముద్రాలలోని నీరు ఆవిరయి మేఘాల దప్పిని తీరుస్తాయి. మేఘాలు వర్షించి భూమిని తడుపుతాయి. ఆ తడికీ, వేడికీ భూమిమీద అపారవృక్షజాతులు మొలకెత్తి పెరుగుతాయి. ఆకులు చిగురెత్తీ, కొమ్మలుసాగీ పూలూ పళ్ళూ వస్తాయి. ఈ మొక్కలు జీవరాశికి చల్లని నీడనూ అహారాన్ని అందిస్తాయి- చివరకి ఈ జీవుల దవుష్ట్యానికి బలయిపోయి నశిస్తాయి. నశించకముందు బీజాల్ని అవి వదుల్తాయి. అందువలన మొక్కలు మరలాపుట్టి, పెరుగుతాయి. నశిస్తాయి: పుడతాయి. పెరుగుతాయి. నశిస్తాయి. మరలా.... మొక్కలమీద ఆధారపడి బ్రతికే ఈ జీవులు రకరకాలు. కొన్ని దుర్భరమయినవి. కొన్ని బలవంతమయినవి బలంగల జీవులు బలంతక్కువయిన జీవుల్ని చంపితింటాయి. అధికారాన్ని చలాయిస్తాయి. ఘర్షణ తప్పదు. పోరాటం వుంటుంది. ఈ జీవనపోరాటంలో బలంగలజీవులు నిలద్రొక్కుకుంటాయి. బలంలేనివి బలి అయిపోతాయి. ఈ జీవుల్లో మరలా బుద్ధిగల జీవులూ, బుద్ధిలేనిజీవులూ అనివున్నాయి. తనకుగల బుద్ధిబలంవల్లన, మనిషి, అనంతమయినప్రకృతినీ ప్రపంచంలోని సకల జీవరాశినీ తన అదుపులోనికి తెచ్చుకొనటానికి నిరంతరం ప్రయత్నిస్తూనేవున్నాడు - అంటుంది విజ్ఞానశాస్త్రం. విజ్ఞానశాస్త్రం ఎన్నో వాస్తవాల్ని తెలుపుతోంది. తనచుట్టూ తానుతిరుగుతూ, సూర్యునిచుట్టూకూడా నిర్ణయింపబడిన దూరంలో, ఈభూమి పరిభ్రమించటము వలన జీవుల వునికికీ మనుగడకూ తగిన ఉష్ణోగ్రతాస్థితిగతులూ, వేడీ వెలుగులూ అంది వృక్షతతులూ, జీవరాసులూ మనుగడ సాగించగలుగుతున్నాయనీ విజ్ఞానశాస్త్రమే చెబుతుంది. ఈ విజ్ఞానశాస్త్రాన్ని మధించి, సృష్టిరహస్యాన్ని ఛేదించి ప్రపంచానికి సర్వాధికారి ఆయిన - ఈ మనిషి ఒక విచిత్రమయిన రెండుకాళ్ళ జంతువు. మనిషి సంఘజీవి అయ్యాక, ఆసంఘానికి అవసరమయిన కొన్ని పద్ధతుల్ని ఏర్పరచుకున్నాడు. ఈ పద్ధతులు కాలానుగుణంగా మారక తప్పదు. ఆమార్పు సంఘర్షణని అనివార్యం చేస్తుంది. బలవంతుడూ, బలహీనుడూ, వున్నవాడూ, లేనివాడూ, అగ్రవర్ణంవాడూ, అధమ వర్ణంవాడూ, సంపన్నరాజ్యాలూ, పేదదేశాలూ, ఎర్రతోలువాళ్ళూ, నల్లతోలువాళ్ళూ - ఇలాగ ప్రపంచం రకరకాలుగా విభిన్నమయిన వర్గాలుగా అయి, ప్రాబల్యంకోసం నిరంతరం సంఘర్షణకు తలపడటం జరుగుతూవుంది. ఆ విధంగా ప్రపంచ చరిత్ర రచనసాగుతూ వుంది. సామూహిక న్యాయవిశేషాల్ని ఆలాపించి, వైయ

త్రిక విషయానికి వస్తే, ఈ మనిషి ఎంత చిత్రమయినవాడు అనిపిస్తుంది! వాఙ్మయం, చరిత్రా తరతరాలుగా ఘోషిస్తూనేవుంది, మనిషి హుళక్కి అని.

అయినా,-నేనూ, నాదీ అన్న భ్రమలోపడి, అరిషడ్వర్గాలకు తలవొగ్గి, స్వార్థంతో పెట్టివేషాలు వేస్తున్నాడు,మనిషి వచ్చినప్పుడు తెచ్చింది ఏమీలేదు. పోవునప్పుడుకూడా తీసుకొని వెళ్ళేదికూడా ఏమీవుండదు. మట్టిలోనుంచి వచ్చిన శరీరం చివరికి మట్టిలోనే అయిక్యమయిపోక తప్పదు. కాల్చినా, పాతిపెట్టినమా. అయినా-క్షణ భంగురమయిన ఈ జీవితకాలంలో, అహం పెచ్చరిల్లగా, ఈ వెఱ్ఱిమనిషి వేసే వేషాలు కోకొల్లలు. ఆ కారణం వలననే - అనందం, విషాదం నవ్వు, ఏడ్పు, సుఖం, దుఃఖం మొదలయిన చిత్ర భ్రమలకు లోనయి విపరీతావస్థలకు గురి అవుతున్నాడు ఈ వెఱ్ఱి మానవుడు.

ఓ మనిషీ! నువ్వెవరవు? ఎక్కడినుంచి వచ్చావు? ఎక్కడికీ నీ ప్రయాణం? ఈ జీవితానికి అర్థం ఏమిటి? ఏమి సాధించాలని ఈ ప్రయాస? నేనూ, నా భార్యా, నా పిల్లలూ నా సంసారం, నా రాష్ట్రం, నా దేశం, నా ప్రపంచం! ఇవన్నీ నీవా? నీలోవున్న స్వార్థానివా? రోజురోజుకీ పుచ్చిపోతూ ఛిద్ర దశకు పయనిస్తూన్న ఈ శరీరం నీదా? ఎంతసేపూ? నెలరోజులనాడు కనపడి, బలవంతాన ఇంటికి తీసుకువెళ్ళి, ప్రాణంపెట్టి, సత్కారం చేసిపంపిన ప్రియమిత్రుడు ప్రకాశరావు ఇవాళలేడు! ఏడీ? ఎక్కడకు వెళ్ళేడూ? ప్రకాశరావూ, అతనితో స్నేహం, ప్రేమా, ఇవన్నీ ఇక మిగిలిపోయిన జ్ఞాపకాలేగదా! మృత్యువు విశ్వవ్యాప్తమై పొంచిచూస్తూవున్నదిరా. దానికోరలకు ఏక్షణాన ఎవరు బలిఅవుతారో తెలయదు. అందువలన క్షణం క్షణం రిస్కుకి లోనవుతూ, నడుస్తూవున్న ఈ గాజుబ్రతుకునుగూర్చి అంత తాపత్రయం ఎందుకురా కాంతిగా? కాంతారావుగారూ?—

అక్కడ వరకు వ్రాసి ఆనాడు కాంతారావు కలం ముందుకు సాగలేదు.

కాంతిమతి రాసిన ఉత్తరం జ్ఞాపకానికివచ్చింది. కాంతిమతి పుట్టింటికివెళ్ళి నెలరోజులయింది. ఈ నెలరోజులూ కాంతారావు జీవితం ప్రశాంతంగా సాగింది. పత్రికలవాళ్ళకి రెండు కథలూ, మూడువ్యాసాలూ రాసిపంపాడు. కాంతిమతి నోరు పెద్దది. చెడ్డదికూడా అందువలన పది సంవత్సరాలు సంసారంచేసి, ఇద్దరుపిల్లలు కలిగినాకూడా ఆకాపురంలో కాంతిమతి దాషీకమే కొనసాగుతూవుంది. అందుకు ఒక కారణంగా కాంతారావు నోరులేనితనాన్నికూడా పేర్కొనాలి. అది కాంతిమతిదృష్టిలో చాతకానితనంగా పేరుబడింది.

"నేను మధ్యాన్నం రెండుగంటలకు అక్కడకి వచ్చే ట్రయినులో శనివారంనాడు వస్తున్నాను. స్టేషనుకి రండి" అని రాసింది కాంతిమతి. అది ఆర్డరు.

గోడ గడియారం ఠంగున ఒకటికొట్టింది.

ఆ దెబ్బకి, రాత ఆపి, తలెత్తిచూశాడు కాంతారావు రైళ్ళు లేటుగారావడం అలవాటే అయినా ముందునూవచ్చే ప్రమాదం వుంది. అందువలన ముందే వెళ్ళివుంటే అతర్వాత కాంతిమతినుంచి నిష్ఠూరాలు వుండవు. అది సుఖమయిన పద్ధతి.

ఇంటికి తాళంవేసి వీధినపడ్డాడు కాంతారావు. తాళం చెవులు పక్కింట్లో ఇచ్చాడు.

సూర్యుడు చండనిప్పుల్ని విరజిమ్ముతున్నాడు. గాలి వేడిసెగల్ని చిమ్ముతూవుంది.

నేల పెనంలాగా కాలిపోతూవుంది.

గొడుగేసుకుని చరచరా నడచాడుకాంతారావు స్టేషనుకని.

ㅤㅤ○ㅤㅤ○ㅤㅤ○

వెలిసిపోయిన స్టేషను బిల్డింగుకి ఒకప్రక్కగా, కటకటాల దగ్గర నిలబడివుంది ఒక ముసలిగన్నేరు చెట్టు. కొమ్మల్ని కొట్టుకుపోయినవాళ్ళు కొట్టుకుపోగా, కాకిలాగా లేకిగా నిలబడిన ఆచెట్టు, ఆమధ్య కురిసినవర్షాలకి చిగుళ్ళు వేసింది. బండబారిపోయి, మొండిగా అయినట్లున్న ఆచెట్టు క్రింద వుడీవుండనట్లున్న నీడలో పడివుంది ఒక ఆకారం. ఆ ఆకారానికి ఆరడులపొడుగునా తెల్లటిగుడ్డ కప్పివుంది. దానిముందు ఒకమనిషి కూర్చుని గుండెలు పగిలేటట్టు రోధిస్తున్నాడు ఆతనిముందు పరచివున్న మాసినదుప్పటి మీద అయిదు పైసలు పదిపైసలు, పావలాలు, అర్ధరూపాయి నాణాలు చిల్లర నుల్లరగా పడివున్నాయి.

అక్కడ కూర్చుని గుండెలుబాదుకుంటూ ఏడ్చేవాడు గురవయ్య.

"ఓర్నాయినో, ఒరిదేముడో, అమ్మా, నాతల్లీ, నువ్వు ఇట్టాసేసావు సస్తావనుకోలేదే. దిక్కులేనిసావు. సచ్చావుగదే అమ్మా. నాయమ్మా నవమాసాలుమోసి నన్నుగన్నావుగదే, ఓయమ్మా. నాదగ్గిర సిల్లికానీకూడా వుండి సావలేనుగదే తల్లీ. నిన్నే ఇధాన తగలేసేదే తల్లీ?నాయునల్లారా! దర్మాతల్లారా! దిక్కులేనిసావు సచ్చిన, నాతల్లిని నేనెట్టా తగలెయ్యను మహానుబావుల్లారా?....దయతలచండి బాబుల్లారా!

స్టేషనుకి వచ్చిపోయేవాళ్ళు అదివిని ఆగి జేబుల్లో చేతులుపెట్టి. అందిన పావలా, అర్థా ఆగుడ్డమీద విసిరేసి తమదార్ని తాము పోతూవున్నారు. తాముచేసిన ఆసహాయం వలన ఏదోవిధంగా ఆముసల్ది తగలబడుతుంది లెమ్మన్న సంతృప్తిని సొంతం చేసుకుంటున్నారు. పుణ్యాత్ములన్న భావనకి లోనవుతున్నారు.

ఆ నిద్ర గన్నేరుచెట్టు మొదట్లోకి వచ్చి నిలబడింది ఒక ఎర్రకుక్క. కడుపుడు సంతానాన్ని కన్న ముత్తయి దువులాగ వుంది, అది. భాష అర్థంకాక పోయినా, గుర వయ్య కష్టంలో వున్నాడని గుర్తించింది అది. అందువలన దానికళ్ళు తడిగా అయ్యాయి. ఏడుస్తూవున్న గురవయ్య గాడ్ని జాలిగా చూస్తూవుంది అది. గురవయ్య అవస్థకి గుండెలు కరిగిన బేలహృదయినిలాగా మూగాగా రోదిస్తూ, కన్నీరు కారుస్తూ నిలబడివున్న ఆ కుక్కని గురవయ్య చూశాడు.

"అమ్మో! అమ్మో! దీని బాబుగాడి సొమ్ము ఇక్కడ దాచిపెట్టినట్లు ఈ లెని కుక్క మళ్లీ దాపరించిందిరా, నాయనా. దీనికి బుద్ధిలేదుగనరా బాబూ" అంటూ శోకంతో కూడిన రాగస్థాయిని కొద్దిగా తగ్గించి, నేలమీంచి ఒక వలుకు గులకరాయిని తీసి గురిచూసి కుక్కపైకి విసిరాడు గుర వయ్య. నడుం మీద రాయితగిలి, బాధగా కుయ్యోమని అరుస్తూ, దూరానికి పరుగెత్తింది కుక్క. అలా పరు గెత్తిన ఆ కుక్క పది నిముషాలలోనే తిరిగి ఆ స్థానానికి వచ్చి నిలబడింది. గురవయ్య శోకాలు వింటూ, వాడి దీన స్థితికి బాధపడసాగింది. ఏడవటం మొదలు పెట్టింది. అలాగ అప్పటికి చాలాసార్లు జరిగింది.

అటు ఇటు చూసాడు గురవయ్య. ఎండ నిప్పులు చెరిగి పోస్తూవుంది గాలి వేడిగా కుతకుతలాడి పోతూంది.

"ఏంట్రా ఎదవా? సెమటతో తడిసి పోతావున్నాను. ఇంకా ఎంతసేపురా నాకీ శిచ్చ??" -ముసుగులోంచి గుస గుసగా మాటలు వచ్చాయి.

"అయిపోయింది కూంతసేపు ఆగరా ఎంకా. ఇంకా, ఈ "జనం ముండా కొడుకులు" నడవటం మానిసావలేదు. పేలాలేగి పోతున్నట్టుగాఏగిపోతానే నడిచ్చత్తన్నారుగందా"

"ఇకనే నాగలేనెహె పొద్దున్నుంచి సత్తన్నానుగందా"

"మా బాబుగాదు రెండ్ని నిమిషాలోపికవట్టు. సందు జూసుకుని లెగిసిపోదాం మన్నాటకం బయటపడితే జనం మక్కెలిరగ దంతారు. అయిపోయిందిలే"

"నేనాగను - అంటే ఆగను"

"బాబ్బాబు. నామాటినుకో. మల్లీ ఈ కుక్క ముండ నా ప్రాణానికి దాపరించిందే తల్లీ. ఎన్నిసార్లు కొట్టినా దీనికి బుద్ధి, గ్నానం వున్నట్టు నాకగవట్టం లేదుగందా" అంటూ ఒక వలుకురాయి నందుకుని గురిచూసి విసిరాడు గురవయ్య. ఆ దెబ్బకి కాలు అదిరిపోగా, కుయ్యోమంటూ కుంటుకుంటూ పరుగెత్తింది కుక్క.

o o o

గొడుగు మడిచి వుస్సురంటూ స్టేషనుకి చేరాడు.

స్టేషనులో అంతా కోలాహలంగా ఉంది. అవతలి స్టేషను రెండు రయిళ్ళు గుద్దుకున్నాయట. చాలామంది ప్రయాణీకులు చచ్చిపోయారట. ఎంతోమందికి అంగ వైకల్యం అయిందట. కొంత మంది చావు బ్రతుకుల్లో వున్నారట. ఆ వార్త అప్పుడేవచ్చి రైలువేవాళ్ళు కాళ్ళు కొట్టుకుంటున్నారు

కాంతారావు గుండెలు అదిరాయి. మనసు వికలమయి పోయింది

కిటికీ దగ్గరవున్న గుమస్తాని అడిగాడు.

"ఏ బండికంటీ యాక్సిడెంటయిందీ?"

"యాభయినాలుగు డవున" అన్నాడాయన చిరాగ్గా, కోపంగా.

"అంటే?"

"యాభయినాలుగు డవును కండీ" కరిచినట్టు అన్నా డాయన.

"అంటే ఏంటండీ? ఏ బండీ?"

గుమాస్తా, తినేసేటట్టు కాంతారావునిచూసి, పళ్ళు కొరికాడు. తలవంచుకొని తనపనిలోమునిగిపోయాడు. కాంతా రావుని గు ర్తించదలచినట్లులేదు.

"54 డవునంటే ఏ బండండీ?"

"పాసెంజరే!"

"అంటే-మన బందరూ, బెజవాడా పాసెంజరేనా?"

"ఆఁ"

"అంటే- ఇక్కడికి రెండుగంటలకు చేరుకునే పాసింజ రేగా? అదేనా?"

గుమస్తా తలను అవునన్న ట్టు వూపాడు.

"యాక్సిడెంటు ఆ బండికే అయిందంటారా? వేరే బండికి అయితే తప్పు నంబరు కయినట్టుగా ఇన్‌ఫర్మేషన్ వచ్చే అవకాశం వుందంటారా? ఏ మంటారూ?"

"యూ ఫూల్. గెటవుట్" అన్నట్టుగా కిటికీ తలుపు ధడాల్మని వేశాడు. గుమాస్తా. కాంతారావుకి మొహంమీద కొట్టినట్లనిపించింది.

"గాడిదకొడుక్కి ఎంతటెంపరూ!అత్తారింటికివచ్చి;అలిగి కూర్చుని మామ్మీది ధుమధుమలు పెళ్ళాంమీద చూపించే అల్లుడ్లా, వీడు వీడి వెధవమొహమూ, బయటకిలాగి నాలుగు తన్నేవాడు లేకనేగదా వెధవ్వేషాలూ!" అని అతన్ని తిట్టు కుని ఇవతలికి వచ్చాడు కాంతారావు. కానీ, మనసుమనసులో లేదు. ప్లాటుఫారం ఈ చివర్నుంచి ఆ చివరికి నడిచి - ఒక పంచకట్టాయునా, ఒక కోటుధారీ, ఒకనిలువునామాలాయునా, ఇద్దరు కాలేజీ స్టూడెంట్లూ ఎదురవగా - వాళ్ళందర్నీ ఆపి. అడిగి,ఆరాదీసి, యాక్సిడెంటయింది ఆ బెజవాడా, బందరూ ప్యాసింజరుకే అని తెలుసుకున్నాడు. గజగజలాడిపోయాడు.

అతని నవనాడులూ కుంగిపోయాయి.

గుండెలు అతివేగంగా కొట్టుకున్నాయి.

మనసు ఉంగలు చుట్టుకుపోయింది.

ప్రపంచం శూన్యమయినట్లు అనిపించిచింది.

తను ఇంటి దగ్గర కాగితాల మీద రాసిన, ప్రపంచపు అశాశ్వతతత్వం, తలపుకు వచ్చింది. భోరుమని ఏడుద్దామని పించింది. బయటికి ఏడవలేక పోయాడు.

ఆ బండిలో కాంతిమతీ, పిల్లలూ వస్తున్నారు. ఆ బండిలోనే రావాలా వాళ్ళూ?

వాళ్ళేమయ్యారు? భగవంతుడి దయవలన ఆపదు నుంచి గట్టెక్కారా? లేక మృత్యువు వాతనుబడి తనను అన్యాయంచేశారా?

ఏం చేయాలి?

ఇప్పుడు తను ఏం చేయగలడు? ఇంటికివెళ్ళి డబ్బులు తీసుకుని యాక్సిడెంటయిన వూరువెళ్ళాలి. అది సరే. పదేళ్ళు సాగిన వచ్చని సంసారం ఏమయేటట్టూ?

కాంతారావు మనస్సు గిర్రున బండిచక్రంలాగా తిరిగింది. తాగిన వాడివలె తూలుకుంటూ, అప్రయత్నం గానే అడుగులువేసి ఆ నిద్ర గన్నేరు చెట్టుక్రిందకివచ్చి నిలబడ్డాడు కాంతారావు.

అతన్నిచూసి గురవయ్య భోరుమన్నాడు-ఈ శనిగా డెవడ్రా అన్నట్లు చూస్తూ.

"ఎండ అదరగొట్టూ వున్నా బుద్ధిలేక ఈ గాలితొత్తు కొడుకులకు బజార్లో ఈ తిరుగుళ్ళేమిటిరా నాయనా ? ఈ పరిస్థితుల్లో ఏంజేసి చద్దామంటావురా బాబూ"

"ఛ. నోర్ముయ్యిహె. వళ్ళిరగడంతానెదవా. చమట్తో చస్తున్నాను. ఇక నేనులేచి పోతాను. ఆగలేను" ముసుగు లోంచి వెంకడు శివాలెత్తుతున్నాడు గుసగుసగా. గురవయ్య ఆమాటలకి కాంతారావు ఇహంలోకి వచ్చిపడ్డాడు.

"ఏం జరిగింది బాబూ?" అని అడిగాడు గురవయ్య.

"మా అమ్మ! ననుగన్నతల్లి పోయింద నాయినా. చేతుల్లోచిల్లికానీ కూడాలేదునాకు అమ్మని తగలెయ్యాలి. డబ్బుగావాలి. నీకు తోచినదర్మంచేసి వెంటనే పెళ్ళిపోమా రాజా!

"ఈ తల్లికి ఎవరూలేరా !" అన్నాడు జాలిగా కాంతారావు

"ఎందుకులేరు నానా, చెట్టంత కొడుకుని నేనులేనా? ఎదురుగా కనబట్టం లేదా?

"పాపం! ఎప్పుడు పోయింది ప్రాణం?"

"నిన్న అర్థరాత్రప్పుడు చచ్చింది. అప్పట్నించీ నాకు ఈ చావు వచ్చిపడింది నానా'

"ఈమెకు నువ్వు ఒక్కడివేనా, సంతానం?"

"ధరమంజేసి అవతలకి పో బాబూ, అంటే' ఈ ప్రెశ్నలు ఏం ప్రెశ్నలు బాబూ? కన్నతల్లిపోయి తట్టిడు దుక్కంతో వుండి, తగలెయ్యటానికి కట్టెలులేక నేను సస్తా వుంటే నన్ను వట్టుకుని ఏలాడతన్నావేంటి నానా? డబ్బు ల్లేకపోతే తగలేమన్కి కట్టెలుగానీ, మనుషులుగానీ, వూరికే వస్తాయనుకున్నావా? దయగలిగితే ఒక రూపాయో, అర్థో అక్కడ పడేసి పోరాదా?" – భగ్గు మన్నాడు గురవయ్య.

అది గమనించని కాంతారావు కళ్ళల్లోకి అశ్రువులు పొంగివచ్చాయి. గుండెల్ని తొలుచుకుని వచ్చిన సముద్రాలు వుప్పొంగాయి. కాంతిమతీ, పిల్లలూ ఏమయి పోయారో అన్న భయంకరమైన ఆలోచన మనసుని పురుగు లాగ తినేస్తూవుంది. శిలలా అలాగే నిలబడిపోయాడు కాంతారావు.

"దీన్తల్లి ఏదోపోయినట్టుగా మాటిమాటికి ఇక్కడికి వచ్చి ఏడుస్తానంటుందిరా బాబు, ఈ కుక్కముండ ఎన్ని మార్లు తరిమి కొట్టినా ఈ గాలిదానికి బుద్దిలేదూ" అంటూ ప్రక్కన పడివున్న కర్రనుదీసి విసిరాడు గురవయ్య కోపంగా. నిద్రగన్నేరు చెట్టు మొదలునుంచి కుయ్యో మంటూ దూరంగా పరుగుదీసిందికుక్క.

సడెన్‌గా–ముసుగును ఒక్క తన్ను తన్ని గుడ్డను అవతలకి విసిరేసి, లేచికూర్చున్నాడు వెంకడు!

ఆ దృశ్యాన్ని నోరు వెళ్ళబెట్టి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు కాంతారావు! కళ్ళు పెద్దవిచేసి చూస్తున్న కంతారావుకి వళ్ళంతా చెమట్లుపట్టాయి ముసుగులోంచి లేచి నిలబడిన వెంకడు బుంగమీసాల్తో, మెలిదిరిగిన కండల్తో ఎర్రంగా అయివున్న మిడిగుడ్లతో కాంతారావు వంక భయం కరంగా చూసాడు-డొక్కలో బలం కొద్దీ కాంతారావుని ఒక కుమ్ము కుమ్మాడు–కాంతారావు క్రిందపడిపోయాడు.

డబ్బుల్తోవున్న దుప్పటినీ, ముసుగుబట్టనీ, చకచక మడుచుకుని, చంకలో పెట్టుకుని ఇద్దరూ ఆఘమేఘాల మీద వుడాయించారు. పిట్టల్లాగ పారిపోతున్న వాళ్ళ కెదురుగా-

సడన్‌గా మలుపు దిరిగిందిలారీ. బాణంలాగా దూసుకు వచ్చింది. మృత్యువువలె మీదిమీదికి వచ్చింది. భీకరంగా యమస్పీడుగా వస్తున్న లారీ బ్రేకులు కర్ణకఠోరంగ కీచు మన్నాయి.

కొన్ని క్షణాలుమాత్రమే అప్పటికే జరగవలసింది జరిగిపోయింది. ఎర్రెర్రగా, భయంకరంగా అయిన ఆ లారీ చక్రాలక్రింద, విగత జీవులయి పడివున్న గురవయ్య వెంకడు జనం పోగవుతున్నారు. ఆ దారుణాన్ని చూడలేక ఇవతలకి వచ్చాడు కాంతారావు, కాలుచేతులు గజగజలాడగా.

ఈ ప్రపంచం అంతారిస్కుకి లోనయివుంది. బ్రతుకే ఒక లాటరీలాగా వుందిగదా! ఇలా ఈనిమిషాన, ఆ ఇద్దరు దున్నపోతులూ, మృత్యువుకి బలి అయిపోతారని కొన్ని నిముషాలకి ముందు తను అనుకున్నాడా? లేదే. మరిఇదేమిటి?

కాంతారావుకి కాలుచేతులు వణికాయి. ఆగొడవలో గొడుగు సంగతి మర్చిపోయాడు. తాగినవాడిలాగ తూలుతూ, అప్రయత్నంగానే ఇల్లుచేరాడు. నెత్తి మాడింది. కాళ్ళు కాలాయి.

ఇల్లు! తన ఇల్లు.

ఏముంది, ఇంకా ఇంట్లో?

ఇల్లు ఇల్లనియేవు

ఇల్లు నాదనియేవు

నీ ఇల్లు ఏదే, ఓమనసా?

కాంతీ,

కాంతి మతీ

నీకేమయింది? నా జీవితనేస్తమా? అబ్బ! డొక్కలో నొప్పి!

కాంతిమతికి నోటి దూకుడు అన్నమాట నిజమేకాని, నువ్వ ఎంతమంచిదానివీ! నిన్నెలాగఒదులుకోనూ? కాంతిమతీ! నీవు లేని నా జీవితం వూహించుకోవటానికే భయంకరంగా అన్పిస్తూవుందే? ఏంచేసేది?

తోలు తిత్తి ఇది

తోలు తిత్తి ఇది

తోలు తిత్తిరా, నరుడా! పామరుడా!! మరెందుకు నీకి భయంకరమైన వ్యధా!

కేవలం ఆరడుగులనేలా, ఇన్నికట్టెలూ, ఒక్కఅగ్గిపుల్లా ఇవేరానీకు అవసరమైనవీ,

అమ్మో,

గుండెల్లో పోటు!

ఆ మిడిగుడ్ల రాక్షసుడు ఎంత బలంగా గుద్దాడూ?

తను బ్రతికి మరల బట్టగట్టగలడా? అసలు ఎందుకు ఇక తను బ్రతకటం?

కాంతీమతీ, పిల్లలూ లేని బ్రతుకు తనకువద్దు ఆవెలితిని తను భరించలేడు!

మాయా సంసారము, తమ్ముడు.

నీమదిలో సదాశివుని, మరువకు తమ్ముడూ,

'అమ్మా! నాన్న వచ్చారేయ్'-పాపసంభ్రమపూర్వక అరుపువిని ఆలోచన్ల నుంచి బయటపడ్డాడు కాంతారావు.

ఆ కేకలికి చంకలో బాబును వేసుకొని లోపటినుంచి ఆత్రంగా చకచకా వచ్చింది కాంతిమతి; సౌభాగ్యవతి, పుణ్యవతి, నిజపత్ని, తన ఇంటి దీపం తన ఆశలపందిరి. కాంతారావు కన్నులలో తడి వుబికింది. ఆనందంతో గుండెలు గుబగుబ మన్నాయి.

ఒక నెలరోజుల విరహం. ఎండిబీటలు వారిన నేలమీద తొలకరిజల్లు పునస్సమాగమం. మాకోసం స్టేషనుకి వెళ్ళి వస్తున్నారా? మేము రైలుకి రాలేదు. అన్నయ్య స్నేహితు డొకాయిన, కారులో ఈ వూరువస్తుంటేనూ, అందులో వచ్చా ములెండి. కష్టపడ్డారుగాని, మొహం కడుక్కోండి. కాఫీ ఇస్తాను. అంది కాంతిమతి ప్రేమగా అలాగేనన్నట్లు తలవూపి కాంతారావు, వెయ్యిఏనుగుల బలంతో గాబుదగ్గరకు మొహం కడుక్కోవటానికి వెళ్ళేడు,

ఈ బ్రతుకును గూర్చి అంతతాపత్రయం ఎందుకురా! కాంతిగా?

మొహం కడుక్కొబోతున్న కాంతారావు, చింపిన ఆకాగితం ముక్కమీద, ఉదయం దిగుల్లోపడి తనురాసిన, ఆ మాటల్ని చదువుకొని ఉలిక్కి పడ్డాడు! నేలమీద చింపి పారవేయబడివున్న కొన్ని కాగితం ముక్కల్లో అది ఒకటి. నిర్దాక్షిణ్యంగా చిన్నచిన్న ముక్కలుగా చింపివేయబడిన ఆలోచనాపరంపరలు ఆపని కాంతిమతిదా? పిల్లలదా? అన్న ఆలోచనలోపడ్డాడు కాంతారావు.!